# మేలి విత్తనాలు

*- గోళ్ళమూడి పద్మజ*

"నీ దగ్గర ఏమేమి విత్తనాలున్నాయి సీతయ్యా! కాకర విత్తనాలుంటే యిద్దూ!" పెరట్లో ఆవుకి పాలు తీస్తున్న సీతయ్యను అడిగాడు అప్పుడే లోపలికి వచ్చిన గోవిందు.

వీపు మీద ఆనుకుని వున్న ఐదేళ్ల విష్ణుని కిందకి దించి, భార్య రాజ్యలక్ష్మికి పాలచెంబు అందించి లేస్తున్న సీతయ్యతో గోవిందు- "ఎందుకయ్యా నీకీ భారం? వున్న బరువులు చాలవా?" అన్నాడు విష్ణుని చూస్తూ. వెంటనే సీతయ్య "గోవిందూ ఇలాంటి మాటలెప్పుడూ అనకు. వీడు నాకు బరువా?" అంటూ విష్ణుని ఎత్తుకుని లోపలికి వెళ్లిపోయాడు.

ఒత్తయిన కనుబొమలు, లోతైన కళ్లు, వెడల్పుగా వున్న పెదవులతో మొరటుగా కనిపించే సీతయ్యను చూస్తూ మనిషి మోటుగా వున్నా యితని కళ్లలో తడి ఎప్పుడూ ఆరదు. మనసు వెన్న అనుకున్నాడు గోవిందు.

ముభావంగా విత్తనాలు అతని చేతికిచ్చి తన గదిలోకి వెళ్లిపోయాడు సీతయ్య. మంచం పక్కన వున్న పెద్ద చెక్క పెట్టెలోంచి పొడవైన నోట్‌బుక్ ఒకటి తీసి, గోవిందన్న మాట వల్ల కల్గిన బాధంతా అందులో రాసుకున్నాడు.

ఉన్న కాస్త పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, ఆ గ్రామంలో అందరితో తలలో నాలుకలా మసలుకునే సీతయ్యకు రకరకాల విత్తనాలు సేకరించడం, అడిగిన వారికి యివ్వడం ఎంతో యిష్టమైన పని. వూళ్లో అందరూ అతన్ని విత్తనాల సీతయ్య అంటారు. అంతగా చదువుకోకపోయినా వీధి బడిలో నేర్చుకున్న యాభై ఆరు అక్షరాలతో పదాలను అల్లి, సంతోషమైనా, బాధ అయినా తన అనుభూతులను పుస్తకంలో వ్రాసుకోవడం అతనికి అలవాటు.

కాలువలో యీత నేర్చుకోవడానికి వెళ్లిన ఒక్కగానొక్క పదేళ్ల కొడుకు నీటి పాలై ఏడాదన్నా తిరక్కముందే సీతయ్య తమ్ముడు, మరదలు రైలు ప్రయాణంలో మరణించారు. వారి బిడ్డ విష్ణులో పోయిన తన కొడుకుని చూసుకుంటున్నాడు సీతయ్య. వరసగా యిన్ని దెబ్బలను తట్టుకోలేని రాజ్యలక్ష్మి మతిస్థిమితం లేక అనారోగ్యంతో ఎప్పుడూ మంచంపట్టి వుండడంతో విష్ణు ఆలనాపాలనా పూర్తిగా సీతయ్య పైబడింది.

సాయంత్రం వీధి అరుగు మీద కూచుని, కాలువ నుంచి కావిడితో నీళ్లు తీసుకువచ్చి రోడ్డు కిరువైపులా వున్న చెట్లకు పోస్తున్న సీతయ్యను గమనిస్తున్నాడు గోవిందు. ప్రతిరోజూ సాయంత్రం సాయిబాబా గుళ్లో మొక్కలకు, రోడ్డు మీద వున్న మొక్కలకు నీళ్లు పోస్తుంటాడు సీతయ్య. తమ గ్రామం యీమాత్రం పచ్చదనంతో కళకళలాడుతోందంటే అదంతా సీతయ్య చలువే. ప్రతి యింట్లో అరటిచెట్లు, కూరగాయల మొక్కలు, రకరకాల పూలమొక్కలు దగ్గరుండి నాటించి, అందరికీ మొక్కల పెంపకం గురించి జాగ్రత్తలు చెప్తుంటాడు. అపుడపుడు తీరిక చిక్కినపుడు ఏ కాఫీ హోటల్లోనో దినపత్రిక చదవడం తప్ప మరే పుస్తకం చదవకపోయినా సీతయ్య తన తోటివారికి ఎన్నో విషయాలు విడమరచి చెప్తుంటాడు. కుటుంబ సమస్యలను పరిష్కరిస్తుంటాడు.

సీతయ్య నడకలో తడబాటుని గుర్తించిన గోవిందు అతని దగ్గరకెళ్లి మెల్లగా అతని భుజం తట్టి, "సీతయ్యా! పొద్దున్న అన్న మాటకు యింకా బాధపడుతున్నావా? మొన్న సంవత్సరీకాలకొచ్చినపుడు పిల్లవాడి మేనమామ వాడిని తీసుకెళ్తాం అన్నపుడు యివ్వాల్సింది. వాళ్లు బాగా వున్నవాళ్లు కదా! నీ కష్టం చూడలేక అలా అన్నానంతే. వేరే ఉద్దేశం లేదు. చాలా అలసినట్టున్నావు. వెళ్లి విశ్రాంతి తీసుకో" అన్నాడు.

"డబ్బు తల్లిదండ్రులు లేని లోటు తీర్చగలదా గోవిందూ! విష్ణు అత్త స్వభావం తెల్సి కూడా ఎలా



పంపించగలను? వాడిని పెంచడం నాకంత కష్టమా? కష్టాలతో పోరాడలేనివారు ఏం సాధించగలరు? ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావే! నువ్వన్న మాటకు నాకేం బాధా లేదు. ఏం శ్రమపడ్డానని విశ్రాంతి? అటు చూడు..." అంటూ అక్కడకు దగ్గరలో యిల్లు కడుతున్న మేస్త్రీలను, కూలీలను చూపించాడు సీతయ్య.

ఇంతలో "సీతయ్యా! నీ యిల్లు చల్లగుండాలి. నీ దయ వల్ల మా పిల్లలకింత నీడ దొరికింది" అంటూ సీతయ్య పెరట్లో చెట్ల కింద ఆడుకుంటున్న తమ పిల్లల కోసం వచ్చిన కూలీ రంగయ్య అంటుంటే,

"ఈ శ్రమజీవుల దీవెన చాలదా గోవిందూ ఈ బ్రతుక్కి? అనుకున్నది సాధించడానికి" అన్నాడు సీతయ్య.

"ఇంతకీ ఏం సాధించావ్?" స్నేహపూర్వకంగా నవ్వుతూ అడిగాడు గోవిందు.

"నీకు తెలియదా ఏం సాధించానో?" దూరంగా కనిపిస్తున్న ఎలిమెంటరీ స్కూల్‌ను చూపిస్తూ.

త్వరలో హైస్కూల్‌గా మారబోతున్న ఆ స్కూల్‌ను చూస్తూ, "సర్లే... ఇంతకీ కాలేజీ ఎప్పుడు రప్పిస్తున్నావ్?" అని గోవిందు అడుగుతుంటే,

వీరి సంభాషణ వింటున్న రంగయ్య "ఆఁ కాలేజీనా బాబూ, ఎప్పుడొస్తదయ్యా?" అని ఆశ్చర్యపోవడం చూసి,

"నీ పిల్లలు పెద్దవాళ్ళయ్యేసరికి వచ్చేస్తుందిలే రంగయ్యా" అంటూ తన యింట్లో కెళ్లిపోయాడు సీతయ్య.

✦ ✦ ✦

పదేళ్లు గడిచిపోయాయి. ఆ గ్రామంలో వున్న ఎలిమెంటరీ స్కూల్ హైస్కూలయింది. మంచి బిల్డింగ్ లేకపోయినా ఒక పెంకుటింట్లోనే తరగతులు జరుగుతున్నాయి. అదే స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విష్ణు మంచి మార్కులతో ఉత్తీర్ణుడై ఆ జిల్లాకే ఫస్ట్ వచ్చాడు. అతనికి వచ్చిన పతకాన్ని చూసి ఊళ్లో జనమంతా మన సీతయ్య పెంచిన మొక్క బంగారు పూలుకాక మరేం పూస్తుంది అనుకుని మురిసిపోయారు. ఈ సంగతి విని విష్ణు మేనమామ పరుగున వచ్చాడు. పిల్లాడిని తీసుకెళ్లి చదివిస్తానన్నాడు. సీతయ్య ఒప్పుకోలేదు.

ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న పక్క టౌన్‌లో విష్ణుని ఇంటర్మీడియెట్‌లో చేర్పించాడు. టౌన్‌లో కాపురం పెడదామంటే రోగిష్టి భార్యతో

వనులతో వీలుకాక హాస్టల్‌లో వుంచి చదివించాడు. ఖర్చులకు తన వాటా పొలం అమ్మక తప్పలేదు సీతయ్యకు.

ఒకరోజు సాయంత్రం యింటి ఆవరణలో సువాసనలు వెదజల్లుతూ విరబూసిన జాజిపూల పందిరి కింద కూచుని సీతయ్య తన సలహా కోసం వచ్చిన వారెవరితోనో చెప్తున్నాడు, "ప్రతివారూ మన మాటే వినాలి. అలాగే చేయాలి అనుకోవడం మంచిది కాదు. కుటుంబానికి శ్రేయస్కరం కాదు. కాస్త ఆలోచించి..." అంటుండగా అప్పుడే అక్కడకు వచ్చిన విష్ణు మేనమామ, "బావుందయ్యా బావా... నీ నీతిబోధ. మరి అదే మాట నీకు కూడా వర్తిస్తుందిగా. నీ పొలం అమ్మి విష్ణుని చదివిస్తున్నావు. వాడినింకా పెద్ద చదువులు చదివించాలంటే అమ్మడానికేం వుంది నీ దగ్గర ఈ పాత యిల్లు తప్ప? నువ్వు కూడా కాస్త ఆలోచించు. పట్నంలో వాడిని యింజనీరింగ్ చదివించి నా కూతురునిచ్చి పెళ్లి చేస్తానంటున్నాగా. ఇప్పటివరకు నీ మాట విన్నాం. నువ్వూ కాస్త నా మాట విను మరి" అన్నాడు.

కాస్సేపు ఆలోచించి విష్ణుకు మంచి భవిష్యత్తు వుంటుందన్న ఉద్దేశ్యంతో సీతయ్య సరేనన్నాడు.

✦ ✦ ✦

విష్ణు ఐ.ఐ.టి.లో చదువు పూర్తిచేసి క్యాంపస్ సెలక్షన్‌లో మంచి ఉద్యోగం వచ్చి స్థిరపడ్డాడు. ఏ రెండేళ్లకో ఒకసారి గ్రామానికి వచ్చి రెండ్రోజులుండి వెళ్లిపోవడం తప్ప పెద్దగా రాకపోకలేం లేవు. సీతయ్య భార్య రాజ్యలక్ష్మి పోయినప్పుడు కూడా ఏదో పని వల్ల రాలేక పోయాడు. గ్రామాభివృద్ధి పనులతో తీరిక లేకుండా సీతయ్యకు గడచిపోతోంది.

సీతయ్య విష్ణుకు "గ్రామంలో సంపన్నుల వద్ద నుండి మన వూళ్లో కాలేజీకి బిల్డింగ్ కట్టించడానికి విరాళాలు బాగా సేకరించాము. నావంతు విరాళంగా దక్షిణం వైపు స్థలం వుంచుకుని మిగతా యిల్లు యిచ్చేద్దామనుకుంటున్నాను. నీ సంతకాలు కూడా అవసరం. మీ నాన్న వాటా, ఉత్తరం వైపున్న స్థలం కూడా నువ్వు కాలేజీకి యిస్తే బాగుంటుంది. నువ్వెలాగూ స్థిరపడ్డావు గనుక యిస్తావనే ఆశిస్తున్నాను" అంటూ ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు లేదు.

ఒకనాడు వీధి అరుగు మీద కూచుని ఏదో ఆలోచిస్తున్న సీతయ్యతో, "చూశావా సీతయ్యా! ప్రేమలు ఎలా అంతరించిపోతున్నాయో. తరాలతోపాటు అంతరంగాలు కూడా మారి పోతున్నాయి. నువ్వేమైనా చెప్పు మన రోజుల్లో లాగా లేరయ్యా ఇప్పటివాళ్లు. ప్రేమలు చంపేసుకుంటున్నారు. స్వార్థంతో గిరిగీసుక్కూచుంటున్నారు. పక్క రాష్ట్రంలో వుంటేనే రాలేకపోతున్నాడే. విదేశాలకు వెళ్తాడటగా, ఇంకేం వస్తాడు? నువ్వేమో నీ యిల్లు కాలేజీ అయిపోయినట్టు, కుర్రాళ్లు యీ చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటున్నట్టు కలలు కంటూండు" అన్నాడు గోవిందు నిట్టూరుస్తూ.

"గోవిందూ! మనకెదురైన చేదు అనుభవాల వల్ల లోకం అంతా చేదైపోయిందనీ, ప్రేమ చచ్చిపోయిందనీ అనుకోకూడదు. వాడు రానంత మాత్రాన ప్రేమ లేదనా? వరదల్లో, తుఫానుల్లో వృక్షాలు కూలిపోయి కొట్టుకుపోయి నాశనమైపోయినా ఎక్కడో ఏదో ఒక ఒడ్డున దాగిన విత్తనం మళ్లీ మొలకెత్తట్లేదా? ఏదీ అంతరించిపోవడం అంటూ వుండదు గోవిందూ! కాల ప్రభావం వల్ల కాస్త అటూ ఇటూ చెల్లాచెదురవుతాం అంతే. భూగర్భంలో దాగిన విత్తనంలా మనసులో వున్న ప్రేమ ఏదో ఒకనాడు తప్పక మొలకెత్తుతుంది చూస్తుండు" అన్నాడు సీతయ్య శాంతంగా నవ్వుతూ.

ప్రకృతితో తమకు పరిచయం కల్గించిన మిత్రుడు విత్తనాల సీతయ్యను చివరిసారిగా దర్శించడం కోసం వచ్చి, రకరకాల పూలను చేతుల్లో పట్టుకుని నిలబడి వున్న జనాన్ని తప్పించుకుంటూ పరుగు పరుగున ఇంట్లోకి అడుగుపెట్టిన విష్ణుకి పూలరథంలో ఊరేగింపుకి సిద్ధంగా వున్న సీతయ్య మృతదేహం కనపడి స్థాణువైపోయాడు. పళ్ల బిగువున దుఃఖాన్ని అదిమిపెట్టి గోవిందు జరగవలసిన క్రియలకు ఏర్పాట్లు చేస్తున్నాడు.

సీతయ్య యింటి వద్ద నుండి కాలువ వరకు

సాగిన ఊరేగింపులో దారికిరువైపులా నీలి ఆకాశంలోకి విశాలంగా విస్తరించి వున్న పచ్చని చెట్లు, కేవలం నారు మాత్రమే పోసి వదిలెయ్యక నీరు పోసి పెంచిన తమ దేవుడిపై పూలను, ఆకులను రాల్చి మూగగా రోదించాయి.

అంత్యక్రియల అనంతరం శూన్యంగా వున్న యింట్లో వుండలేక విష్ణు గోవిందు వద్దకు వచ్చాడు. ప్రియమిత్రుడిని పోగొట్టుకుని రోదిస్తున్న అతన్ని ఎలా పలకరించాలో అర్థంకాక నిలబడి వున్న విష్ణుతో "కూచో బాబూ... నీ కళ్లలో కన్పిస్తున్న ప్రశ్నలకు జవాబు చెప్తాను. ఇన్నాళ్లూ టౌన్‌లో వున్న మీ దాయాది నర్సయ్యకు దృష్టి పాత యింటి మీదకు ఎందుకు మళ్లిందో. మీ యింటి పక్కనున్న తన పెంకుటిల్లు పడగొట్టి డాబా కడ్తానంటూ యీ వూరొచ్చాడు. మీ తాతలు సరిగా పంచుకోలేదంటూ, మీ సరిహద్దుల రాతకోతలు సరిగా లేవనీ, పట్టాలన్నీ తిరగేసి, మీ సరిహద్దు గోడ ఆవరణలో సపోటా, జామ, పొగడ చెట్లున్న కాస్త ముక్కా తనకు వస్తుందని గొడవపెట్టి గెలిచాడు.

అన్నదమ్ముల మధ్య గెలుపు ఓటమి లేమిటంటూ సీతయ్య సరిపెట్టుకున్నా, చెట్లను పడగొట్టెయ్యబోతున్నారన్న మాట విని కుప్పకూలిపోయాడు. తనకు దక్కకపోయినా పచ్చగా వుంటే చాలనుకున్నాడే కాని యీ చెట్లపై వేటు పడుతుందన్న ఊహకే విలవిల్లాడిపోయాడు. దక్షిణం వైపున్న స్థలం హక్కును నర్సయ్య చేతిలో పెడ్తున్నప్పుడు సీతయ్య చెయ్యి ఆకులా వణికింది. ఆ క్షణంలో అతని కళ్ల నుంచి చిందినది కన్నీటి చుక్క కాదు బాబూ! నెత్తురు..." అతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ఒక్క క్షణం ఆగి మళ్లీ చెప్పాడు– "అదేం విచిత్రమో... నర్సయ్య ఆ చెట్లను నరికెయ్యడానికి ఎప్పుడు తలపెట్టినా ఆ అకృత్యానికి ప్రకృతి రోదిస్తోందా అన్నట్టుగా కుండపోతగా వర్షం పడేది. పని నిలిచిపోయేది. వర్షాకాలం గడిచాక వస్తానంటూ నర్సయ్య టౌన్‌కి వెళ్లిపోయాడు. పని ఆగింది తాత్కాలికంగానే అని తెల్సినా సీతయ్య ఊరట పొందేవాడు. వర్షంలో తడుస్తూ, ఆ చెట్లను చూసుకుంటూ గంటలు గంటలు గడిపేవాడు. అతని పరిస్థితి చూసి నీకు ఉత్తరం రాశాను. కానీ నువ్వు వచ్చేసరికే ఇలా అయింది.

"ఆ రోజు ఏమైందో ఏమో చెట్టుకింద నిద్రపోతున్నాడనుకున్నాం. కాని ఆ మనిషి మరింక లేవలేదు" గద్గద స్వరంతో చెప్పాడు గోవిందు.

"పెద్దనాన్న ఏమైనా ఆత్మ..." మాట పూర్తిచెయ్యలేకపోయాడు విష్ణు.

"అంత పిరికివాడేం కాదు బాబూ... నీకు గుర్తులేదా? చిన్నప్పుడోసారి నీ చేతిలోని పావురం పిల్లని గ్రద్ద తన్నుకుపోయిందని ఏడుస్తుంటే నీకేం చెప్పాడో!"

విష్ణుకి మనసులో ఆ సంఘటన మెదిలింది. "ఏడవడం పిరికివాళ్ల లక్షణంరా. గరుత్మంతుడు దేవుడి వాహనం. నీకింక ప్రాప్తం లేదు... అంటూ తన్నుకుపోయాడు. ప్రాణం పోకడ మన చేతిలో లేదు. శివుడి ఆజ్ఞ అంతే... అప్పుడే కాదు, ఎప్పుడూ కూడా తనకు దక్కని వాటి గురించి బాధపడవద్దని చెప్తుండేవాడు. అటువంటి మనిషి– కొడుకు, తమ్ముడు, మరదలు, భార్య... యిందర్ని పోగొట్టుకున్నా నిలదొక్కుకున్న మనిషి చెట్లతో ఎంత అనుబంధం పెంచుకున్నాడో..." అనుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోయాడు.

మర్నాడు విష్ణు ఆస్తి వివరాల కోసం సీతయ్య గదిలో వున్న చెక్కపెట్టె తాళాలు వెతికి తాళం తీస్తున్న సమయంలో అతనికి కాఫీ, ఫలహారం తీసుకొచ్చిన గోవిందు "ఆ పెట్టెలో మీ పెదనాన్న ఏం బంగారవు విత్తనాలు దాచిపెట్టాడో చూస్తున్నావా బాబూ! నేను మధ్యాహ్నం మళ్లీ వస్తా గానీ ఏం విత్తనాలు దొరికాయో నాకు చెప్పు. ఏం వుంటాయిలే..." అనుకుంటూ వెళ్లిపోయాడు.

చిన్న చిన్న ప్లాస్టిక్ కవర్లలో వున్న విత్తనాలు, కొన్ని చిన్న చిన్న మూటలు తీస్తుంటే అతనికి సీతయ్య చేతి వ్రాతతో వున్న నోట్‌బుక్స్ కనపడి ఒకటి, రెండు పేజీలు తిరగేశాడు. ఒక పేజీలో... "ఏ మనిషీ ఒంటరి కాదు. దేవుడు మనిషికి తోడుగా మనసు యిచ్చాడు. రెండు కనుపాపల నిచ్చాడు. ప్రకృతిలోని అందాలన్నీ స్వంతం చేసుకోమన్నాడు. ప్రతి ప్రాణినీ ప్రేమించి,

మనసంతా ఆనందం నింపుకోమన్నాడు..." అని వుంది. ఇది చదివి ఆశ్చర్యంతో, "ఎంత బాగా వ్రాశాడు పెద్దనాన్న. రాత్రిపూట అపుడపుడు వ్రాయడం చూసినా, ఏవో పద్దులు రాస్తున్నాడను కున్నా" అనుకుంటూ పక్కనే వున్న కుర్చీలో కూచుని చదవసాగాడు విష్ణు. మరో పేజీలో యిలా వుంది.

"అంతఃకరణలోని ఆలోచనను ఆచరణలో పెట్టే ప్రయత్నం చెయ్యాలి.

'ప్రేమనూ, ఔదార్యాన్నీ అంతఃకరణలో నింపుకుంటే అడ్డూ అదుపూ లేని ప్రవృత్తి దానంతటదే సరి అయిన దారిలో ప్రవహిస్తుంది. మానసిక శక్తి సద్వినియోగమవుతుంది' అని గుడిలో స్వామీజీ చెప్పినది ఎందరు ఆచరిస్తారు?" విష్ణు చాలా ఉద్వేగంగా చదవసాగాడు.

"శ్రీ సాయినాథుని దివ్య మంగళ ప్రతిమను తనివితీరా చూసుకుంటూ హారతి పాట పాడుతున్న భక్తజనం నన్నాకర్షించారు. కుల భేదం, లింగ భేదం లేకుండా బాలలు మొదలు వృద్ధుల వరకు అన్ని వర్గాలవారు ఒకే భావంతో లీనమై గొంతు కలిపి పరవశంతో పాడుతున్నారు. ఎంత అందమైన దృశ్యమది. వారందరి హృదయాలలో ప్రేమ వరదలై పొంగుతోంది.

గుడిలో దేవుని ప్రతిమ ముందు కర్పూరంలా కరిగిన వీళ్లంతా బయటకు రాగానే శిలలుగా ఎందుకు మారుతున్నారు?

మనిషి చెక్కిన శిల్పంలో భగవంతుని దర్శించ గలిగినవారు ఆ భగవంతుడే సృష్టించిన మనిషిలో ఆయన్నెందుకు దర్శించలేరు?

ఎదుటి మనిషిని కళ్లతో మాత్రమే కాదు, మనసుతో చూడండి. మీ గుండె గుహలో నిగూఢంగా వున్న ప్రేమలోంచి ఒక్క బిందువును వెలికి తియ్యండి. ఆ బిందువు అనంతమై, అమృతమై మీ గుండెకెంత అండగా వుంటుందో తెలుసా! ఆ ప్రేమామృతంతో పుండుగా మారిన మీ గుండెకు చికిత్స జరుపుతోంది. ధాన్యాన్ని వదిలి పొట్టు రావాలనుకుంటున్న మీకు ఆ చికిత్స చాలా అవసరం..." చదువుతున్న విష్ణు అపరాధ భావంతో కళ్లు మూసుకుని నిట్టూర్చి, ఒక్క నిమిషమాగి మళ్లీ చదవసాగాడు.

"కోరని వరంలా లభించిన ఉత్తమమైన మానవ జన్మ ఎత్తినందుకు త్రికరణ శుద్ధిగా మెలిగితే భగవంతుడు కోరిన వరాలు యివ్వడా?" ఒక్కొక్క పేజీ చదువుతున్న విష్ణు మనసులో ఆవరించి వున్న దిగులు కరగసాగింది. అనిర్వచ నీయమైన అనుభూతి కలిగి ఒకే ఒక్క కన్నీటి బిందువు జారి పుస్తకంపై పడింది. ఆ అమృత బిందువు వెల్లువై ఎన్ని మేలి విత్తనాలను తడపనుందో!

"పెద్దనాన్నా! నీవు దాచి వుంచిన యీ అమూల్యమైన ప్రేమ బీజాల్ని వృథా పోనియ్యను" అంటూ పుస్తకాన్ని కళ్లకద్దుకుని హృదయానికి హత్తుకున్నాడు. మనసును ఆహ్లాదపరుస్తూ కిటికీలోంచి వీచిన గాలిలో తేలివచ్చిన పొగడ పూల పరిమళం అతన్ని పిలిచినట్టనిపించింది. బయటికి వచ్చి ఇంటి ఆవరణలో వున్న అరుగు మీద కూర్చున్నాడు. పక్క యింట్లో నర్సయ్య వచ్చిన అలికిడి విన్పించింది. అతనికి అడిగినంత సొమ్ము యిచ్చి చెట్లను చెర నుంచి విడిపించాలను కున్నాడు. వచ్చే సంవత్సరానికి కాలేజి ప్రారంభోత్సవం జరిగేలా ఏర్పాట్లు చెయ్యాలని ధృడంగా నిశ్చయం చేసుకున్నాడు.

కింద రాలిన పొగడ పూలను దోసిలి నిండా తీసుకుని, "పెద్దనాన్నా! నా చేతనైనంత వరకు నాకెదురైన ప్రతి మనసులో ప్రేమ బీజాల్ని నాటడానికే ప్రయత్నిస్తాను. ఆ బీజాలు ఆరోగ్యంగా మొలకలెత్తి సత్ఫలితాలనివ్వాలని ఆశీర్వదించు" అనుకుంటున్న అతనితో అప్పుడే అక్కడకు వచ్చిన గోవిందు, "ఏం బాబూ! ఏం విత్తనాలున్నాయి ఆ పెట్టెలో?" అంటూ అడిగాడు.

"రా మామయ్యా! నాకు దొరికిన మేలి విత్తనాల గురించి చాలా మాట్లాడాలి నీతో" అంటూ ప్రేమపూర్వకమైన గౌరవంతో ఆలింగనం చేసుకున్నాడు విష్ణు. ఆ స్పర్శతో ఒక్కసారిగా సీతయ్య మరల బ్రతికి వచ్చాడా అన్నంత భ్రమ కలిగి విస్మయంగా చూస్తున్న గోవిందుకి విష్ణు కళ్లలో కన్పించిన ఆర్ద్రత వెనుక వున్న స్థిర నిశ్చయం ఎన్ని గుండెల్లో వెలుగు మొలకల్ని నాటనుందో! ●